అంతా.. గందరగోళం..

లబ్ధిదారుల ఎంపికపై గ్రామసభలు ప్రారంభం

- పలు చోట్ల వాగ్వాదాలు, ఆందోళనలు
- నిలదీసిన ప్రజలకు సర్దిచెప్పి పంపిన అధికారులు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా సంక్షేమ పథకాలు అమలు చేసేందుకు లబ్ధిదారుల ఎంపికకు నిర్వహిస్తున్న 'ప్రజాపాలన గ్రామసభలు' మంగళవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పలు చోట్ల అధికారులను ప్రజలు నిలదీశారు. కొన్నిచోట్ల వాగ్వాదం నెలకొంది.

సత్తుపల్లి నియోజకవర్గంలో..


కల్లూరులో గ్రామసభకు హాజరైన ప్రజలు


సత్తుపల్లిరూరల్: కిష్టారంలో..


సత్తుపల్లిటౌన్: మున్సిపాలిటీలో 4వ వార్డులో..

● **సత్తుపల్లిరూరల్:** మండలంలో కిష్టారంలో పెళ్లి కానివారికి రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు వచ్చాయని, మళ్లీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశారని పలువురు అభ్యంతరాలు వ్యక్తం చేశారు. తుంబూరులో అధికారులకు, ప్రజలకు మధ్య సమన్వయ లోపంతో గందరగోళం ఏర్పడగా మిగిలిన గ్రామాల్లో సభలు ప్రశాంతంగా జరిగాయి. మండల ప్రత్యేక అధికారి సునీల్‌రెడ్డి, ఎంపీడీఓ చిన్న నాగేశ్వరరావు, సీఐ టి.కిరణ్, ఏఓ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

● **సత్తుపల్లిటౌన్:** సత్తుపల్లి మున్సిపాలిటీ పరిధిలో 1, 2, 3, 4, 5, 6, 15, 16, 17వ వార్డుల్లో ప్రజాపాలన వార్డు సభల్లో దరఖాస్తులు వెల్లువెత్తాయి. కాంగ్రెస్ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్, మున్సిపల్ వైస్ చైర్మన్ తోట సుజలరాణి, కమిషనర్ మందా రవిబాబు, మేనేజర్ మైసా శ్రీనివాస్, కౌన్సిలర్లు మట్టా ప్రసాద్, పుష్పావతి, మారుతి సూరిబాబు, మేకల భవాని, దూదిపాల రాంబాబు, రాధిక, వార్డు అధికారులు పాల్గొన్నారు.

● **తల్లాడ:** మండలంలోని అన్నారుగూడెం, కొడవటిమెట్ట, మిట్టపల్లి, ముద్దునూరు గ్రామాల్లో అర్హులైన లబ్ధిదారులకు సైతం ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డులు రాలేదని, అనర్హుల పేర్లు వచ్చాయనీ అధికారులతో వాగ్వాదానికి దిగారు. పలు గ్రామాల్లో ప్రజలు దరఖాస్తులు సమర్పించారు. తహసీల్దార్ వనజ, ప్రత్యేకాధికారులు యం.చంద్రమౌళి, కె.శ్రీదేవి, ఎండి.తాజుద్దీన్, ఎస్.దామోదరప్రసాద్, వి.శ్రీనివాసరావు, శ్రీనివాసరెడ్డి, ఆయేషా, ఎ.సింధు పాల్గొన్నారు.

● **వేంసూరు:** మండలంలోని అమ్మపాలెం, భీమవరం, మొద్దులగూడెం, బీరపల్లి, కుంచపర్తి, మర్లపాడు, రామన్నపాలెం, లింగపాలెంరాయుడుపాలెం యర్రగుంటపాడు పంచాయతీల్లో సభలు నిర్వహించారు. కుంచపర్తి గ్రామసభలో ఇద్దరు కాంగ్రెస్ నాయకుల బంధువులకు అర్హత లేకున్నా ఇళ్ల జాబితలో పేర్లు రావడంతో కాంగ్రెస్ నాయకులే అధికారులను నిలదీశారు. అధికారులతో నాయకులు, గ్రామస్తులు దిగారు. ఈ మేరకు ఇందిరమ్మ ఇళ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్ కార్డులు రాలేదని గ్రామంలో రీ సర్వే నిర్వహించాలని డిమాండ్ చేయడంతో రీ సర్వే నిర్వహిస్తామని ఎంపీడీఓ తెలిపారు. భీమవరం గ్రామసభలో కూడ అనర్హులకు పథకాలు వచ్చాయని అధికారులను నిలదీశారు.

● **పెనుబల్లి:** మండల పరిధిలోని పలు గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించి, నాలుగు పథకాల అర్హుల జాబితాను ఆయా పంచాయతీల ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు ప్రజలకు చదివి వినిపించారు. పథకాలకు అర్హులైన లబ్ధిదారులందరి పేర్లు జాబితాలో లేవంటూ కొంత మేర ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేశారు. 11 గ్రామల్లో జరిగిన గ్రామ సభల్లో కొత్తగా ఇందిరమ్మ ఇళ్ల కోసం 625, రేషన్ కార్డులు కోసం 1,008 మంది, రైతుభరోసాకు 69 మంది, ఆత్మీయ భరోసా పథకానికి 1,156 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. తహసీల్దార్ గంటా ప్రతాప్, ఎంపీడీఓ అన్నపూర్ణ, ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

● **కల్లూరురూరల్:** మండలంలో చెన్నూరు, చిన్నకోరుకొండి, రఘునాథగూడెం, పేరువంచ, ఎర్రబోయినపల్లి, పోచవరం, కప్పలబంధం, ముచ్చవరం, కిష్టయ్యబంజర గ్రామాల్లో సభలు నిర్వహించారు. ప్రత్యేక అధికారులు దాసరి చంద్రశేఖర్, ఎ.చక్రవర్తి, సురేష్‌బాబు, ఎస్‌బి శ్రీనివాస్, బి.వెంకటేశ్వరరావు, బాబ్జిప్రసాద్, ఎస్.రవింద్ర, కె.సాయిరాం, ఎం.రూప, బి.రత్నమ్మ ఆధ్వర్యంలో గ్రామసభలు నిర్వహించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు. రేషన్‌కార్డులకు 963, ఇందిరమ్మ గృహాలకు 1,218, ఆత్మీయ భరోసాకు 753, రైతుభరోసాకు 156 మొత్తం 3,090 దరఖాస్తులు వచ్చినట్లు ఎంపీడీఓ దాసరి చంద్రశేఖర్ తెలిపారు.


తల్లాడ: రెడ్డిగూడెం గ్రామంలో..


వేంసూరు: కుంచపర్తి గ్రామంలో అధికారులను నిలదీస్తున్న నాయకులు, గ్రామస్తులు



పెనుబల్లి: గౌరారంలో..

మధిరలో..

పేర్లు లేకపోతే ఆందోళన చెందొద్దు..

● **ముదిగొండ:** అర్హుల జాబితాలో పేర్లు లేకపోతే ఆందోళన చెందకుండా మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని అడినల్ కలెక్టర్ శ్రీజ అన్నారు. మండలంలోని చిరుమర్రి, పమ్మి, గంధసిరి, మల్లారం, పెద్దమండవ, వెంకటాపురం గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించారు. అర్హుల పేర్లు రాలేదని, అనర్హుల పేర్లు జాబితాలో ఉన్నాయని ప్రజలు ప్రశ్నించారు. గందరగోళంగా సభలు జరగడంతో పోలీసులు కలగజేసుకుని సద్దుమణిగించారు. మేడిపల్లి సభలో అడిషనల్ కలెక్టర్ శ్రీజ మాట్లాడారు. తహసీల్దార్ సునిత ఎల్జిబెత్, మండల ప్రత్యేకాధికారిణి విజయలక్ష్మి, ఎంపీడీఓ శ్రీధర్‌స్వామి, ఏఓ వేణు, ఎంపీఓ వాల్మికి కిషోర్, ఏంఈఓ రమణయ్య, ఏపీఓ రంగనాయకమ్మ, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

● **ఎర్రుపాలెం:** మండలంలోని పలు గ్రామాల్లో నిర్వహించి గ్రామసభల్లో రేషన్‌కార్డులు, ఇళ్ల కోసం దరఖాస్తులు చేసుకున్న తమ పేర్లు అర్హుల జాబితాలో ఎందుకు లేవని అధికారులను నిలదీస్తూ ప్రశ్నించారు. తహసీల్దార్ ఉషాశారద, ఎంపీడీఓ సురేందర్, ఎంపీఈవో శ్రీలక్ష్మి ఉన్నారు.

● **బోనకల్:** మండలంలోని బ్రాహ్మణపల్లి, లక్ష్మీపురం నిర్వహించిన గ్రామసభల్లో అధికారులను ప్రజలు నిలదీశారు. అనర్హులను జాబితాలో చేర్పడంపై సభలను అడ్డుకుని సభ జరగనీయమన్నారు. పోలీసులు రంగప్రవేశం చేసి వారికి సర్దిచెప్పడంతో సభలు నిర్వహించారు. జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత గార్లపాడు, జానకీపురం, బ్రాహ్మణపల్లి గ్రామాల్లోని సభల్లో మాట్లాడారు. ప్రత్యేక అధికారి విజయ భాస్కర్‌రెడ్డి, తహసీల్దార్ పున్నం చందర్, ఎంపీడీఓ రమాదేవి, ఎంపీఓ శాస్త్రీ పాల్గొన్నారు.

● **చింతకాని:** మండలంలో నిర్వహించిన గ్రామసభలు రసాభాసగా మారాయి. జాబితాల్లో అనర్హుల పేర్లు ఉన్నాయని, సర్వేను సక్రమంగా చేయలేదని అధికారులపై ప్రజలు మండిపడ్డారు. వందనం సభలో జిల్లా పౌరసరఫరా శాఖాధికారి చందన్‌కుమార్ పాల్గొనగా, నాగులవంచ గ్రామసభను సీపీ సునీల్ దత్ పరిశీలించారు. ఎంపీడీఓ రామయ్య, తహసీల్దార్ కూరపాటి అనంతరాజు, మండల వ్యవసాయాధికారి మానస, డిప్యూటీ తహసీల్దార్ వీరభద్ర నాయక్, ఈజీఎస్ ఏపీఓ కోటయ్య, పంచాయతీ కార్యదర్శులు, ఏఈఓలు పాల్గొన్నారు.


ముదిగొండ: మేడేపల్లిలో గ్రామసభలో మాట్లాడుతున్న అడిషనల్ కలెక్టర్ శ్రీజ


ఎర్రుపాలెం: జమలాపురంలో..


బోనకల్: బ్రాహ్మణపల్లిలో..


చింతకాని: వందనం గ్రామసభలో అధికారులను నిలదీస్తున్న ప్రజలు

వైరా నియోజకవర్గంలో..

● **కారేపల్లి:** మండలంలో 15 పంచాయతీల్లో ప్రజాపాలన గ్రామ సభలను మండల స్పెషలాఫీసర్ గంగాధర్, ఎంపీడీఓ సురేందర్, తహసీల్దార్ సంపత్‌కుమార్, ఎంఈఓ జయరాజు, ఏఓ బట్టు అశోక్ ఆధ్వర్యంలో సభలు నిర్వహించారు. అనర్హులు, ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తున్న వారి పేర్లు ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో చేర్చారని, పూరిగుడిసెల్లో బతుకుతున్న తమ పేర్లు జాబితాలో రాకపోవటం ఏంటని ఎంపీడీఓను వెంకిట్యాతండా ప్రజాపాలన గ్రామసభలో నిలదీశారు. సర్వే చేసిన అధికారులకు ఎవరు అర్హులు ఎవరో అనర్హులు ఎవరో తెల్వదా అనర్హుల పేర్లు చెప్పి గొడవలు పెట్టించేందుకే కాంగ్రెస్ పార్టీ వారు, అధికారులు చూస్తున్నారని భజ్యాతండా సభలో బీఆర్ఎస్ నాయకులు వాగ్వాదానికి దిగారు. స్టేజీపై కాంగ్రెస్ నాయకులు కూర్చున్నారని ఇళ్ల కమిటీలో సూర్యతండా గ్రామానికి చెందిన నాయకులే ఉన్నారని, పంచాయతీలో భాగమైన చంద్రుళ్లగూడెం గ్రామానికి చెందిన వారిని కమిటీలో ఎందుకు తీసుకోలేదని బీఆర్ఎస్ నాయకులు వాగ్వాదానికి దిగారు. దీంతో అధికారులు, పోలీసులు జోక్యం చేసుకోవటంతో సద్దుమణిగింది.


ఏన్కూరు: భగవాన్‌నాయక్ తండా గ్రామసభలో అధికారులను నిలదీస్తున్న ప్రజలు

● **ఏన్కూరు:** అర్హులకు పథకాలు ఇవ్వకుండా అనర్హులకు పథకాలు ఇస్తున్నారంటూ మండలంలోగ్రామసభల్లో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేశారు. భగవాన్‌నాయక్ తండా, బురదరాఘవాపురం గ్రామాల్లో నిరసన వ్యక్తం చేశారు. మండల ప్రత్యేకాధికారి రాంబాబు, తహసీల్దార్ సీహెచ్ శేషగిరిరావు, ఎంపీడీఓ సకినాల రమేష్, ఎస్ఐ రఫీ పాల్గొన్నారు.

● **వైరారూరల్:** మండలంలోని ప్రత్యేక అధికారుల ఆధ్వర్యంలో సభలు నిర్వహించారు. దాచాపురం గ్రామంలో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి 29 మందికి మాత్రమే జాబితాలో ఎంపిక చేయడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అష్ణగుర్తిలో భరోసా పథకానికి అర్హులు వంద మందికి పైగా ఉంటే 25 మంది పేర్లు మాత్రమే జాబితాలో ఎందుకున్నాయని నిలదీయగా సర్వే ఆధారంగా జాబితాను ప్రకటించామని అధికారులు తెలిపారు. జాబితాలో పేర్లు లేని వారు మరల దరఖాస్తులు చేసుకోవాలని అధికారులు సూచించారు.


వైరారూరల్: గొల్లెనపాడులో..


కారేపల్లి: సూర్యతండాలో బారులుదీరిన ప్రజలు


క్లుప్తంగా

పినపాక జెడ్పీహెచ్ఎస్ విద్యార్థి ప్రతిభ


బహుమతి అందుకుంటున్న ఆసిఫ్

తల్లాడ: తెలంగాణ స్టేట్ సోషల్ టీచర్స్ ఫోరం ఆధ్వర్యాన హైదరాబాద్‌లో మంగళవారం నిర్వహించిన రాష్ట్ర స్థాయి సాంఘిక శాస్త్ర ప్రతిభ పాటవ పరీక్షలో తల్లాడ మండలం పినపాక జెడ్పీహెచ్ఎస్ విద్యార్థి షేక్ ఆసిఫ్ ప్రతిభ కనబరిచాడు. పదో తరగతి చదువుతున్న ఆసిఫ్ 83 మార్కులతో రాష్ట్ర స్థాయిలో నాలుగు స్థానం సాధించి ఎస్‌సీఈఆర్టీ డైరెక్టర్ రమేష్ చేతుల మీదుగా బహుమతి అందుకున్నాడు. ఈ సందర్భంగా ఆసిఫ్‌ను హెచ్ఎం పొన్నం నర్సింహారావు, ఉపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి, శ్రీనువాసరావు అభినందించారు.

కార్యవర్గం ఎన్నిక


ఎంపికైన నూతన కార్యవర్గం

సత్తుపల్లి: నేషనల్ క్రిష్టియన్ కౌన్సిల్ సత్తుపల్లి మండల పాస్టర్స్ ఫెలోషిప్ నూతన కార్యవర్గాన్ని మంగళవారం సత్తుపల్లిలో ఎన్నుకున్నారు. జాతీయ పొలిటికల్ వింగ్ అధ్యక్షులు అలవాల కరుణాకర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో కోర్ కమిటీ చైర్మన్‌గా ఎ.సంసోను, అధ్యక్షుడిగా బేతంపూడి వరప్రసాద్, ఉపాధ్యక్షుడిగా ఎస్.యాకోబు, ప్రధాన కార్యదర్శిగా రవికిరణ్, సహాయ కార్యదర్శిగా ఏసన్న, కోశాధికారిగా విజయ్‌కుమార్, గౌరవ అధ్యక్షుడిగా మ్యాథ్యూస్, ప్రచార కార్యదర్శిగా ఏసుపాదం, ఆర్గనైజింగ్ సెక్రటరీలుగా కరుణతేజ, శ్యామ్‌సంగ్, రాజేషలను ఎన్నుకున్నారు. సామేలు, నాగార్జున, ఎం.వేణుపాల్, జాన్‌మార్క్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం

కారేపల్లి: మండలకేంద్రంలోని జామే మసీదులో మోజాన్‌గా పనిచేస్తున్న షేక్ జాఫర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడగా వైద్య ఖర్చుల నిమిత్తం ముస్లీం మైనార్టీ బీఆర్ఎస్ నాయకులు షేక్ గౌసుద్దీన్ రూ.5 వేలు అందించాడు. ఖలీలుల్లాఖాన్, హుస్సేన్, అబ్దుల్ వాహెబ్, ఫిరోజ్ బూది, యాకూబ్ పాషా ఉన్నారు.

రోడ్డు నిబంధనలు పాటించండి

సత్తుపల్లిటౌన్: రోడ్డు భద్రత నియమాలను పాటించటం ప్రతీ ఒక్కరి బాధ్యత అని సత్తుపల్లి ఎంవీఐ జెఎస్ శ్రీనివాస్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాల సందర్భంగా లారీ యూనియన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఏఎంవీఐ దినేష్, రవాణాశాఖ సిబ్బంది వెంకటేశ్వరరావు, ప్రసాద్, కృష్ణ, లారీ యూనియన్ ప్రతినిధులు కొండపల్లి రమేష్‌రెడ్డి, మౌలాలీ, శ్రీనివాస్ పాల్గొన్నారు.


అవగాహన కల్పిస్తున్న పోలీస్ సిబ్బంది

పనుల పరిశీలన


పనులు పరిశీలిస్తున్న శ్రీనివాసరావు

బోనకల్: మండలకేంద్రంలో ఇందిరమ్మ గృహ నిర్మాణ శాఖ ఆధ్వర్యంలో నిర్మాణం చేపడుతున్న ఇందిరమ్మ మోడల్ గృహ నిర్మాణపు పనులను హౌసింగ్ పీడీ శ్రీనివాసరావు మంగళవారం సందర్శించి పరిశీలన చేశారు. నిర్మాణానికి సంబంధించిన అంశాలపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. తహసీల్దార్ పున్నం చందర్, ఎంపీడీఓ రమాదేవి, ఆర్ఐ లక్ష్మణ్‌నాయక్ పాల్గొన్నారు.

ట్రైటా ఆర్గనైజింగ్ సెక్రటరీగా హరికృష్ణ

కారేపల్లి: తెలంగాణ ప్రభుత్వ గిరిజన గురుకుల విద్యాలయాల ఉద్యోగుల సంఘం (ట్రైటా) రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శిగా సింగరేణి గిరిజన గురుకుల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ జి.హరికృష్ణ ఎన్నికయ్యారు. మంగళవారం మండల పరిధిలోని సింగరేణి గిరిజన బాలుర గురుకుల పాఠశాల, కళాశాల అధ్యాపక బృందం ప్రిన్సిపాల్ జి.హరికృష్ణను, ట్రైటా రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన ఇస్లావత్ రవిని ఘనంగా సన్మానించారు. కళాశాల వైస్ ప్రిన్సిపాల్ జయరాజు, అధ్యాపకులు పాల్గొన్నారు.

విద్యార్థులకు దుస్తుల పంపిణీ


దుస్తులతో విద్యార్థినులు

మధిర: మండలపరిధిలోని ఇల్లూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థినులకు హెల్పింగ్ హాండ్స్ గ్రూప్ ఆధ్వర్యంలో బత్తినేని శిరీష, అనిత, ఖాసింబి సహకారంతో మంగళవారం దుస్తులు పంపిణీ చేశారు. హెచ్ఎం రషీద్, ఉపాధ్యాయులు అబ్దుల్ బక్షి, ఆవుల రాంబాబు, బాలాజీ, చిలుకూరి సత్యనారాయణరెడ్డి, సాంబయ్య, శ్రీనివాస్ ఉన్నారు.

ఆరుగ్యారంటీలు అమలు చేయాలి


సత్తుపల్లిరూరల్: మాట్లాడుతున్న భారతి


చింతకాని: మాట్లాడుతున్న గోపాలరావు

సత్తుపల్లిరూరల్: కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరుగ్యారంటీ హామీలను అమలు చేయాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యురాలు మాచర్ల భారతి డిమాండ్ చేశారు. స్థానిక రావి వీరవెంకయ్య భవనంలో మంగళవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. నాయకులు మాదినేని రమేష్, శీలం సత్యనారాయణరెడ్డి, పాండు, కొలికపోగు సర్వేశ్వరరావు, రాజబాబు, వెంకట్రావ్, ఝాన్సీ ఉన్నారు.

అర్హులను ఎంపిక చేయాలి

చింతకాని: ప్రభుత్వం ప్రవేశపెడుతున్న పథకాలకు అర్హులను ఎంపిక చేయాలని సీపీఎం మధిర డివిజన్ కార్యదర్శి మడుపల్లి గోపాలరావు డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని సీపీఎం కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. పార్టీ మండల కార్యదర్శి రాచబంటి రాము, జానికిరాములు, కృష్ణమూర్తి, ఉపేందర్, కోటేశ్వరరావు ఉన్నారు.

కర్రలు పడి వ్యక్తికి గాయాలు

సత్తుపల్లిరూరల్: జామాయిల్ కర్రల లోడ్‌తో వస్తున్న ట్రాక్టర్‌లోని కర్రలు డ్రైవర్‌పై జారిపడటంతో తీవ్ర గాయాలైన ఘటన సత్తుపల్లి మండలం జగన్నాథపురంలో మంగళవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒర్సిసాకు చెందిన జానివస్తు రాజు జగన్నాథపురంలో జామాయిల్ కర్రలను ట్రాక్టర్‌లో వేంసూరు మండలం వెంకటాపురానికి తరలిస్తుండగా ట్రాక్టర్ పొలంగట్టుపైకి ఎక్కడంతో కర్రలు డ్రైవర్ రాజుపై జారిపడ్డాయి. ఈ ప్రమాదంలో రాజుకు తీవ్ర గాయాలయ్యాయి. కూలీలు వెంటనే అతన్ని బయటకు తీసి ఆటోలో ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఆర్టీసీ ఉద్యోగుల కృషి అభినందనీయం


మాట్లాడుతున్న డిప్యూటీ ఆర్ఎం పవిత్ర

సత్తుపల్లిటౌన్: సంక్రాంతి సందర్భంగా ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేరవేయడంలో ఆర్టీసీ ఉద్యోగులు చేసిన కృషి అభినందనీయమని డిప్యూటీ రీజినల్ మేనేజర్ జీఎస్.పవిత్ర అన్నారు. సత్తుపల్లి ఆర్టీసీ డిపోకు మంగళవారం వచ్చిన ఆమె ఉద్యోగులతో సమావేశమయ్యారు. ఖమ్మం రీజియన్‌లోనే లాభాల్లో సత్తుపల్లి డిపో ముందుంటోందని, సంక్రాంతికి 179 అదనపు సర్వీసులను హైదరాబాద్‌కు నడిపించడం ద్వారా రూ.68.06 లక్షల ఆదాయం వచ్చిందని చెప్పారు. కాగా, గ్రాండ్ హెల్త్ ఛాలెంజ్‌లో మిగిలిన వారికి ఖమ్మంలో బుధవారం వైద్యపరీక్షలు చేయనున్నట్లు తెలిపారు. డిపో మేనేజర్ యు.రాజ్యలక్ష్మి, అసిస్టెంట్ మేనేజర్ పి.విజయశ్రీ, ఉద్యోగులు సాహితి, తిరుపయ్య, ప్రభాకర్, బాలస్వామి, కాంతారావు, నాగరాజు, సుబ్బారావు, వెంకటయ్య, కిన్నెర ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

రైతులకు బాసట.. పొలంబాట

విద్యుత్ ప్రమాదాల నివారణ సుగమం

- త్వరితగతిన సమస్యల పరిష్కారం
- నియోజకవర్గంలో సమస్యలు 178, పరిష్కరించినవి 160


ముదిగొండ మండలంలోని లక్ష్మీపురంలో పొలంబాట కార్యక్రమం (ఫైల్)


కొత్త స్తంభాలు వేస్తూ..

ముదిగొండ: తరచూ విద్యుత్ ప్రమాదాలు నివారించేందుకు, సమస్యలు పరిష్కరించేందుకు రూపొందించిన పొలంబాట కార్యక్రమం రైతులకు బాసటగా నిలుస్తోంది. అన్నదాతలు విద్యుత్ ప్రమాదాల బారిన పడకుండా అవగాహన కల్పించేందుకు విద్యుత్ శాఖ ఆధ్వర్యంలోఈ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. వ్యవసాయ బోర్లు, చెరువులు, కుంటలు, బావులు కింద సాగుచేసేటప్పుడు చాలా ప్రదేశాల్లో విద్యుత్ సంబంధిత సమస్యలు తలెత్తడంతో కొంత మంది రైతులు సొంతంగా మరమ్మతులు చేసుకుంటుండగా పలువురు విద్యుత్ ప్రమాదాలకు గురై మృత్యువాత పడుతున్నారు. ఈ క్రమంలో చైతన్యవరచడానికి విద్యుత్‌శాఖ ఒక అడుగు ముందుకు వేసి క్షేత్రస్థాయిలో రైతుల సమస్యలు నేరుగా తెలుసుకుని వాటిని పరిష్కరించేందుకు అధికారులు, సిబ్బం పొలంబాట పట్టారు. ఈ క్రమాన రైతుల్ని అధికారులు, సిబ్బంది పొలాల వద్దకు నేరుగా వెళ్లి రైతులతో మాట్లాడుతుండడంతో చాలా సమస్యలు వెలుగులోకి వచ్చాయి. దీంతో సమస్యలకు పరిష్కార మార్గాలు వెలుగులోకి వచ్చాయి. మధిర నియోకవర్గంలో మొత్తం 178 సమస్యలు వెలుగులోకి రాగ వాటిలో 160 సమస్యలు పరిష్కరించారు. ముదిగొండ మండలంలో ఇప్పటి వరకు 23 పొలంబాట కార్యక్రమాలు నిర్వహించారు. వాటిలో 22 సమస్యలు రాగా 17 సమస్యలు పరిష్కరించారు. పలు రకాల సమస్యలు అధికారుల దృష్టికి రావడంతో తక్షణమే పరిష్కరించడంతో పలువురు రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వెంటనే పరిష్కరించారు..



మా పొలంలో వేలాడుతున్న విద్యుత్ తీగలు నిత్యం సమస్యగా మారిందని విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా వెంటనే వాటిని పరిశీలించి, సరిచేశారు. స్తంభాల నడుమ స్తంభాలను కూడా వేశారు. ఎలాంటి సమస్య ఉన్న వెంటనే వచ్చి చూస్తున్నారు. ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు పాటిస్తున్నారు.

– అమరయ్య, పండురేగుపల్లి, ముదిగొండ

కెపాసిటర్లు ఏర్పాటు చేసుకోవాలి



రైతులు తమ పొలాల్లో మోటార్ల వద్ద కెపాసిటర్లను ఏర్పాటు చేసుకోవాలి. దీనివల్ల విద్యుత్ ఆదా అవుతుంది. తోటి రైతులకు మెరుగుపడుతుంది. మోటార్లు కాలిపోకుండా ఉంటాయి. రైతులకు ఎలాంటి సమస్యలున్నా, విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకురావాలి. విద్యుత్ సమస్యలన్నీ పరిష్కరిస్తాం.

– మేకపోతుల శ్రీనివాస్, ఏఈ ముదిగొండ

ప్రధాన సమస్యలు..

- పొలాల్లో స్తంభాలు ఓవైపు ఒరిగిపోవటం
- ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ పిచ్చి మొక్కలు అల్లుకోవడం, ఒకే ట్రాన్స్‌ఫార్మర్‌పై ఎక్కువ కనెక్షన్లు ఉండడం.
- విద్యుత్ తీగలు కిందకు వేలాడుతూ ఉండడం.
- స్తంభాల మధ్య అధిక దూరం కారణంగా తీగలు వేలాడటం.
- లోఓల్టేజీ సమస్య, ఎక్కువగా ట్రిప్ కావడం.
- సింగిల్ ఫేజ్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేసుకోవడం.